క్లుప్తంగా

గర్భిణులకు టీకాలు



చిన్న పిల్లలకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

గుడిపాల: గర్భిణులు, చిన్నపిల్లలకు టీకాలు వేసినట్లు ప్రాథమిక వైద్యాధికారి చంద్రమహేష్ అన్నారు. టీకాలు వేసే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భవతులకు టీటీ, పిల్లలకు పెంటా, ఎంఆర్, అయిదేళ్లు పైబడిన వారికి బూస్టర్‌డోస్, డీపీటీ వేసినట్లు చెప్పారు. గర్భవతులు, హైరిస్క్ ప్రెగ్నెన్సీ ఉన్న వాళ్లని ఏఎన్‌ఎంలు నిత్యం చూసుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో కాన్పుల సంఖ్యను మరింత పెంచే విధంగా తగుచర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్ వైజర్ విజయ, స్టాఫ్ నర్స్ అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

మైనారిటీ అధ్యక్షులుగా సయ్యద్ అక్బర్ బాషా



సయ్యద్ అక్బర్‌బాషా

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షుడిగా న్యాయవాది సయ్యద్ అక్బర్ బాషా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నియామక ఉత్తర్వులు జారీచేశారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని మైనారిటీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బీజేపీ నాయకుల హర్షం

చిత్తూరు కార్పొరేషన్: కేంద్ర బడ్జెట్‌పై బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, నాయకులు శ్రీనివాసులు, చిట్టిబాబులు శనివారం వేర్వేరుగా ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎక్కువగా వైద్య, విద్య, మౌలికవసతులకు ప్రాధాన్యతనిచ్చారన్నారు. ఆదాయపు పన్ను పరిధిని రూ.12 లక్షల వరకు పెంచి ఉద్యోగులకు ఊరటనిచ్చారని పేర్కొన్నారు. చిన్న తరహా పరిశ్రమలకు పెద్దపీట వేశారని చెప్పారు.

మాజీ వీఏఓకు నివాళి



జిల్లేడుపల్లెలో రఘునాథరెడ్డికి నివాళులర్పిస్తున్న సునీల్‌కుమార్

బంగారుపాళెం: మండలంలోని జిల్లేడుపల్లెలో శనివారం వీఏఓ రఘునాథరెడ్డికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించారు. రఘునాథ రెడ్డి మృతి చెందారన్న సమాచారం తెలుసుకున్న సునీల్‌కుమార్, వైస్‌ఎంపీపీ శిరీషరెడ్డి, స్థానిక సర్పంచ్ భారతి, ఎంపీటీసీ సభ్యుడు శంకర్‌రెడ్డి, కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి తదితరులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రోడ్డెక్కని ఉచిత బస్సు



- హామీలు విస్మరించిన సర్కారుపై మహిళల ఆగ్రహం
- అధికారం చేపట్టి ఏడు నెలలు దాటినా అతీగతీ లేదంటూ విమర్శలు
- చంద్రబాబు మోసపూరిత హామీలు నమ్మి ఓట్లేసి మోసపోయామంటూ గగ్గోలు
- పూతలపట్టు నియోజకవర్గంలో 1,12,815 మంది మహిళా ఓటర్లు

ఐరాల: ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలు గుప్పించడం, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం అన్నట్లుంది కూటమి సర్కార్ తీరు. ఎన్నికల సమయంలో సూపర్-6 హామీలంటూ పెద్ద ఎత్తున ఊదరగొట్టారు. ఆ హామీలు నమ్మి ప్రజలు ఓట్లు వేయడంతో అధికారంలోకి వచ్చారు. ప్రభుత్వం ఏర్పాటై 7 నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారు. సూపర్-6లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అటకెక్కించడంపై పూతలపట్టు నియోజకవర్గ మహిళలు పెదవి విరుస్తున్నారు. అధికారం చేపట్టిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమంటూ ఎన్నికల వేళ హోరెత్తించిన కూటమి సర్కార్ ప్రస్తుతం ఆ ఊసే ఎత్తలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉత్తిదేనా అంటూ పాలకులను ప్రశ్నిస్తున్నారు.

అధికారంలోకి వచ్చాక పట్టించుకోని బాబు

పూతలపట్టు నియోజకవర్గంలో ఐరాల, తవణంపల్లె, బంగారుపాళెం, యాదమరి, పూతలపట్టు మండలాలు ఉన్నాయి. ఇందులో మహిళా ఓటర్లు భారీగా ఉన్నారు. తాజా లెక్కల ప్రకారం నియోజకవర్గంలో 2,233,326 మంది ఓటర్లు ఉండగా ఐరాల మండలంలో పురుషుల ఓటర్లు 2,497, మహిళలు 2.0833, పూతలపట్టు మండలంలో పురుషులు 18,473, మహిళలు 18,958, తవణంపల్లె మండలంలో పురుషులు 21,087, మహిళలు21,886, బంగారుపాళెం మండలంలో పురుషులు 29,967, మహిళలు 30,714, యాదమరి మండలంలో పురుషులు 20,476, మహిళలు 20,424 మంది ఉన్నారు. నియోజకవర్గంలో పురుషుల ఓటర్లు 1,10,500, మహిళా ఓటర్లు 1,12,815 ఉన్నారు. మహిళలకు ఉచిత బస్సు హామీ అమలు చేస్తే వీరందరికీ లబ్ధి చేకూరే అవకాశం ఉంది. కానీ ఎన్నికల సమయంలో మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీ ఇచ్చిన కూటమి నాయకులు ప్రభుత్వం ఏర్పటయ్యాక అమలు చేయకుండా మోసం చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్టీసీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో 80 శాతం రూట్లలో గ్రామీణ ప్రాంతాలకు సైతం సేవలందిస్తున్నారు. మహిళలు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సుల్లో నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. కూటమి సర్కార్ ఉచిత బస్సు హామీ అమలు చేయకపోవడంతో తామంతా నష్టపోతున్నామని మహిళలు మండిపడుతున్నారు.

మహిళలకు సమాధానం చెప్పాలి

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని కూటమి నేతలు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి. ఇచ్చిన హామీ ఇప్పటి వరకు పట్టాలెక్కలేదు. పక్క రాష్ట్రాల్లో అధికారం చేపట్టిన వెంటనే అక్కడి ప్రభుత్వాలు ఉచిత బస్సు హామీని పక్కాగా అమలు చేశాయి. మన రాష్ట్రంలో ఆ ఊసే ఎత్తక పోవడం శోచనీయం. కూటమి సర్కార్ ఈ హామీపై మహిళలకు సమాధానం చెప్పాలి.

–మమత, ఎంపీటీసీ సభ్యురాలు, ఐరాల

తక్షణమే అమలు చేయాలి

అధిక సంఖ్యలో మహిళలు గ్రామీణ ప్రాంతాల నుంచి నిత్యం ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుచేస్తే మహిళలకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ హామీ ఇచ్చేటప్పుడు ఆచరణ సాధ్యమా, అసాధ్యమా అని ఆలోచన చేయాలి. ఎన్నికల్లో గెలిచేందుకు అబద్ధపు హామీలిచ్చి సీఎం పీఠంపై కూర్చున్న తర్వాత ఇప్పుడు హామీలు చూస్తుంటే భయమేస్తోందంటే ఎలా? ఉచిత బస్సు ప్రయాణం తక్షణమే అమలు చేయాలి.

–సిద్ధమ్మ, ఎస్టీ కాలనీ, ఐరాల

కలగానే కనిపిస్తోంది

కూటమి నేతల మాటలు నమ్మి మహిళలు ఓట్లేశారు. ఇప్పుడు మాట తప్పుతున్నారు. హామీ అమలుకు కసరత్తు పేరుతో కాలయాపన చేస్తున్నారు. ఆగస్టు 15వ తేదీ ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్నారు. మళ్లీ సంక్రాంతి పండుగకు అని మభ్యపెట్టారు. ప్రస్తుతం ఉగాదికి అంటున్నారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కలగానే కనిపిస్తోంది. మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి.

–మంజుల, వైఎస్సార్ కాలనీ, ఐరాల

శాస్త్రోక్తంగా వీరాంజనేయ బాలాలయ ప్రతిష్ట



పూజల్లో వేదపండితులు

కాణిపాకం: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో శ్రీ వీరాంజనేయ స్వామి బాలాలయ ప్రతిష్టాపన పూజలను శనివారం శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఈ పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పుణ్యాహవచనం, అంకురార్పణ, పాలిక ఆరాధన, నివేదన, తదితర పూజలు భక్తి ప్రపత్తులతో జరిపించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో పెంచల కిషోర్, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే వైద్యం



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో డాక్టర్ సంధ్య

గుడిపాల: ప్రజల ఇంటి వద్దనే వైద్యం అందిస్తున్నట్లు స్థానిక వైద్యాధికారి సంధ్య తెలిపారు. బసవాపల్లె గ్రామంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 65మందికి వైద్య సేవలు అందించారు. మంచానపడ్డ రోగులకు ఇంటి వద్దే వెళ్లి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది చంద్రశేఖర్, రోసలిన్, కోమల, పంకజ, నిత్య పాల్గొన్నారు.

అవ్వాతాతలకు పింఛన్ కష్టాలు





ఐరాల: వేదగిరివారిపల్లెలో రోడ్డుపై వేచి ఉన్న లబ్ధిదారులు, గుడిపాల: సర్వర్ పనిచేయకపోవడంతో పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు

ఐరాల/గుడిపాల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా 1న వలంటీర్లు తెల్లవారుజామునే ఇంటికి వచ్చి పింఛన్లు పంపిణీ చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛనుదారులకు కష్టాలు మొదలయ్యాయి. పింఛన్ల కోసం సచివాలయాలు, రచ్చబండల దగ్గర పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. శనివారం పింఛన్లు ఇచ్చే సార్ల కోసం అవ్వా, తాతలు గంటల తరబడి ఎదురుచూడసాగారు. అయితే ఉదయం 6.15 గంటల నుంచి సర్వర్ మొరాయించడంతో పింఛన్ల పంపిణీ నిలిచిపోయింది. దీంతో లబ్ధిదారులు సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. కొందరు నిరీక్షించి నిరీక్షించి నీరసించిపోయారు. సుమారు 3 గంటలపాటు వారు అవస్థలు పడ్డారు. ఎట్టకేలకు ఉదయం 9 గంటల తరువాత సర్వర్ పనిచేయడంతో పంపిణీ కొనసాగించారు. ఐరాల మండలంలో 94.15 శాతం పంపిణీ పూర్తి చేశామని అధికారులు వెల్లడించారు.

గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు



పైమాఘంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు



టి.పుత్తూరులో వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కేశవ నారాయణ

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా పల్లెలోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు.మండలంలోని పైమాఘంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 40 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ఆరోగ్య పరిరక్షణ అవసరం

ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరిరక్షణ అవసరమని పీహెచ్‌సీ డాక్టర్ కేశవ నారాయణ అన్నారు. టి.పుత్తూరులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాణిజ్య సముదాయానికి ప్రతిపాదనలు



పాత బస్టాండులో మ్యాప్ పరిశీలిస్తున్న ఏసీపీ, కన్సల్టెన్సీ నిర్వాహకులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర నడిబొడ్డున ఉన్న కాసు బ్రహ్మానందరెడ్డి మునిసిపల్ బస్టాండులో వాణిజ్య సముదాయ నిర్మాణం కోసం అధికారులు ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర శనివారం తన సిబ్బందితో కలిసి బస్టాండులోని ప్రాంగణాన్ని సందర్శించారు. అనంతపురం నుంచి వచ్చిన ఓ కన్సల్టెన్సీ నిర్వాహకులతో కలిసి బస్టాండులో ఉన్న స్థలం, గతంలో రూపొందించిన ప్లాన్లను పరిశీలించారు. ఇక్కడ బస్టాండుతోపాటు వాణిజ్య సముదాయాన్ని నిర్మించడానికి అధికారులు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పీపీపీ మోడ్ ద్వారా బయటి వ్యక్తులకు బస్టాండును అప్పగించాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి తప్పనిసరి. ఇదే సమయంలో మునిసిపల్ స్థలాన్ని మూడేళ్లకు మించి ఇతరులకు లీజుకు ఇచ్చే అధికారం పాలకవర్గానికి, అధికారులకు లేదు. పాలకవర్గం ఆదేశాలతో ప్రస్తుతం ప్లాన్లు రూపొందిస్తున్నామని, అటు తరువాత కౌన్సిల్, ప్రజా ప్రతినిధులు దీనిపై నిర్ణయం తీసుకుంటారని ఏసీపీ నాగేంద్ర తెలిపారు.

రిటైర్డు పోలీసులకు సన్మానం



విరమణ పొందిన పోలీసులతో ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: పోలీసుశాఖలో పనిచేసి, ఇటీవల పదవి విరమణ పొందిన పోలీసులను ఎస్పీ మణికంఠ సన్మానించారు. చిత్తూరులో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆర్ఎస్ఐ ఎంజీ.నటరాజన్, హెడ్‌కానిస్టేబుళ్లు మునిరాజులు, మునిరత్నం గత నెల విరమణ పొందగా.. వీళ్లను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఇక కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో భాగంగా దేహదారుఢ్య పరీక్షల కోసం పనిచేసిన ప్రభుత్వాస్పత్రి వైద్యులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

పోలీసు సంఘ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ఎస్పీ, యూనియన్ నాయకులు

చిత్తూరు అర్బన్: రాష్ట్ర పోలీసు సంక్షేమ సంఘం – 2025 వార్షిక డైరీను చిత్తూరు ఎస్పీ మణికంఠ ఆవిష్కరించారు. చిత్తూరులోని పోలీసు అతిథి గృహంలో శనివారం జిల్లా అధ్యక్షులు ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీలు మహబూబ్‌బాషా, చిన్నికృష్ణ, ఎస్‌బి సీఐ భాస్కర్, మనోహర్, సంఘ సభ్యులు పరంధామ నాయుడు, ఖాదర్, వల్లియమ్మ పాల్గొన్నారు.

ఫోర్జరీ ముఠా అరెస్టు ?

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు అర్బన్ తహసీల్దార్ సంతకం ఫోర్జరీ విషయంలో ముఠాను రెండు రోజుల్లో అరెస్ట్ చూపే అవకాశాలు ఉన్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఈ ఫోర్జరీ ధందాలో ముగ్గురు వ్యక్తులు కీలకంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇద్దరు వీఆర్‌ఏలు, ఓ ప్రైవేటు ఫైనాన్స్ సిబ్బంది పాత్ర ఉన్నట్లు సమాచారం. దీంతో పాటు మరింత మందిని ఈ కేసులో చేరుస్తారా లేదా అనేది తెలియాల్సి ఉంది. రెండు రోజుల్లో ఈ ముఠా వ్యవహారాన్ని పోలీసలు అధికారులు బట్టబయలు చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం.